క్లుప్తంగా

ఆ పోలీసులపై కేసు నమోదు చేయండి



విజయవాడరూరల్: థర్డ్ డిగ్రీ ఉపయోగించిన పోలీసులపై కేసు నమోదు చేయాలని మహాజన సోషలిస్ట్ పార్టీ, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు మంద వెంకటేశ్వరరావు మాదిగ రూరల్ డిమాండ్ చేశారు. మరుసుమల్లి గ్రామస్తుడు వడ్లపూడి సంసోను మాదిగను ఇద్దరు కానిస్టేబుల్స్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి థర్డ్ డిగ్రీ ఉపయోగించారని వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి, సస్పెండ్ చేయాలని కోరుతూ మంగళవారం రూరల్ మండల తహసీల్దార్ బి.సుగుణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వడ్లమాటి బాబురావు, కె.కమలరాజు, డి.వీరాస్వామి, ఎల్.వాసు,దయాకర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నాడీశోధన వైద్యంతో ఆరోగ్యం



పెనమలూరు: నాడీ శోధన వైద్యంతో ఆరోగ్యంగా ఉండొచ్చని యోగాశక్తి సాధన సమితి వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ మాకాల సత్యనారాయణ అన్నారు. కానూరు అశోక్‌నగర్‌లోని తన కార్యాలయంలో మంగళవారం ఉచిత నాడీ శోధన వైద్య శిబిరం నిర్వహించి వివరాలు తెలిపారు. మానవదేహంలో నాడీ శోధనతో అవయవాల పనితీరును గుర్తించి ప్రాణశక్తి కేంద్రాలను చైతన్యం చేస్తే అనారోగ్యాన్ని తగ్గించవచ్చని వివరించారు. నాడీశోధనతో మూల సమస్యలు గుర్తించి చికిత్స చేస్తే వ్యాధులు తగ్గుతాయని, ఖర్చు కూడా తక్కువగానే ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ నాడీశోధన వైద్యంపై అవగాహన పెంచుకోవాలని సత్యనారాయణ సూచించారు.

డ్రోన్ అప్లికేషన్‌లో 'వికాస్' ప్రతిభ

నున్న(విజయవాడరూరల్): నున్నలోని వికాస్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో పాలిటెక్నిక్ ఆఖరి సంవత్సరం చదువుతున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషీన్ లెర్నింగ్ విభాగ విద్యార్థులు ప్రాజెక్ట్ వర్క్‌లో భాగంగా డ్రోన్ ను తయారు చేశారు. వ్యవసాయం, వైద్యరంగం, సైబర్ సెక్యూర్టీ అత్యవసర సహాయ రంగం తదితర విషయాల్లో ఉపయోగకరమైన డ్రోన్‌ను తయారు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.గోపాలకృష్ణ తెలిపారు. పైతాన్ ప్రోగ్రాం ఉపయోగించి విద్యార్థులు డ్రోన్‌ను తయారు చేశారన్నారు. ఈ డ్రోన్‌తో వ్యవసాయ పంటలకు మందుల పిచికారీ చేయడం, పంటల్లో చీడపీడలను నివారించుకునేందుకు దోహద పడుతుందన్నారు. పలు అంశాలను ప్రాజెక్ట్ టీమ్ గుణ చరణ్ తేజ, శ్రీరామ్, తనుష్ తారక్, ప్రదీప్ వివరించారు. ప్రాజెక్ట్ తయారు చేసిన విద్యార్థులను, కంప్యూటర్ సైన్స్ ఉపాధ్యాయులను కళాశాల సెక్రటరీ ఎస్.సత్యనారాయణరెడ్డి అభినందించారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు



ఉయ్యూరు: చార్ట్ కౌన్సిలింగ్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎన్ఎంయూ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు మంగళవారం కూడా కొనసాగాయి. దీక్ష శిబిరాన్ని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు ప్రాంభించారు. ఆయన మాట్లాడుతూ డిపో మేనేజర్ ఏకపక్ష నిర్ణయాలతో ఉద్యోగ, కార్మికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. చార్ట్ కౌన్సిలింగ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 19న తలపెట్టిన చలో మచిలీపట్నం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు నాగిరెడ్డి, కేవీ రావు, టీపీ రావు, జీఎస్ రావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వృద్ధుడు మృతి

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం బొమ్ములూరు వద్ద ఈ నెల 8వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏలూరు జిల్లా పెదపాడు మండలం వేంపాడుకు చెందిన సాయల థామస్ (68) హనుమాన్‌జంక్షన్‌కు ద్విచక్రవాహనంపై వస్తుండగా చెన్నై-కోల్‌కత్తా జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులో ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీకొట్టింది. దీంతో కిందపడిన థామస్ తలకు తీవ్రగాయం కావడంతో మంగళగిరి ఎయిమ్స్ ఆస్పత్రిలో చేరాడు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఘటనపై జంక్షన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎక్కడ చూసినా పగుళ్లే!

- మూన్నాళ్ల ముచ్చటగా సిమెంటు రోడ్డు
- నాణ్యతా లోపాలపై అనుమానాలు
- పట్టించుకోని అధికారులు

కంకిపాడు: రహదారుల నిర్మాణంలో నాణ్యత డొల్లగా మారింది. పనులు అంతా నాసిరకమే. రోడ్లు ఎక్కడివక్కడ పగుళ్లువారి నాణ్యతా లోపాలకు దర్పణంగా నిలుస్తున్నాయి. లక్షలు వెచ్చించి నిర్మించిన రోడ్లు మూన్నాళ్ల ముచ్చటగా మారాయంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా నిర్మాణ పనులు అస్తవ్యస్తంగా సాగాయన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.





కంకిపాడులో మండల పరిషత్, రెవెన్యూ కార్యాలయాల వద్ద సిమెంట్ రోడ్డుకు పగుళ్లు

మండల పరిషత్ వేదికగా...

మండలంలోని 20 గ్రామాలకు కూడలి కంకిపాడు పట్టణం. కంకిపాడు ప్రధాన పట్టణంలో మండల పరిషత్ కార్యాలయం ఉంది. కార్యాలయ ప్రాంగణంలో తహసీల్దార్, గృహనిర్మాణశాఖ, హౌసింగ్, ఐసీడీఎస్, పంచాయతీరాజ్, వెలుగు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించిన శాఖలు ఉన్నాయి. నిత్యం ఇక్కడకు కంకిపాడు మండలంతో పాటుగా పెనమలూరు నియోజకవర్గంలోని ప్రజలు వస్తుంటారు.

రూ.19 లక్షలతో రహదారుల నిర్మాణం

మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న అనేక విభాగాలకు వివిధ పనులు నిమిత్తం వచ్చే ప్రజలు, అధికారుల సంఖ్య అధికంగా ఉంటుంది. చిన్నపాటి వర్షం కురిసినా ఆ ప్రాంగణం నీటిమడుగుగా మారడం, రోజులు తరబడి మురుగు కదలక ఇబ్బందులు పడుతున్న పరిస్థితి. ఇలాంటి పరిస్థితుల్లో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో రూ.19 లక్షలు సాధారణ నిధులు మంజూరయ్యాయి. ఇంత వరకూ బాగానే ఉన్నా తర్వాత జరిగిన రాజకీయ పరిణామాల్లో పాలకవర్గ ప్రతినిధులు కూటమి చెంతకు చేరారు. సాధారణ నిధులు రూ.19 లక్షలతో కార్యాలయ ప్రాంగణం అంతటా మెరక పనులు, సిమెంటు రహదారుల నిర్మాణాలు పూర్తయ్యాయి. దీనికి తోడు రూ.22 లక్షలతో కార్యాలయ ప్రాంగణం చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టారు. పనులు తుదిదశలో ఉన్నాయి.

పనులు అస్తవ్యస్తం

రోడ్ల నిర్మాణ పనులు మాత్రం అస్తవ్యస్తంగా సాగాయి. మూన్నాళ్ల ముచ్చట చందంగా రోడ్ల నిర్మాణం సాగిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మండల పరిషత్, రెవెన్యూ కార్యాలయాల ఎదుట ఉన్న రోడ్డు పగుళ్లబారి అస్తవ్యస్తంగా దర్శనమిస్తోంది. సిమెంటు రోడ్డు నిర్మించినా రోడ్డు మార్జిన్లలో బరంతు వేయలేదు. దీంతో వాహనాల ధాటికి తొక్కుడుకు గురై రోడ్డు మార్గం పగుళ్లు వారింది. నాణ్యతా ప్రమాణాలు కూడా పాటించకపోవడంతో పగుళ్లు వారి ఉండొచ్చని పలువురు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

పర్యవేక్షణ ఏదీ?

పంచాయతీ రాజ్ శాఖ ఏఈ అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవలే మృతి చెందారు. ఈ కారణంగా పెనమలూరుకు చెందిన ఏఈకి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

దీంతో శాఖాపరమైన పర్యవేక్షణ పూర్తి స్థాయిలో కొరవడిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫలితంగా రోడ్లు అస్తవ్యస్తంగా నిర్మాణం జరిగిందని, పగుళ్లువారడానికి కూడా కారణమైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రభుత్వం స్పందించే వరకు పోరాటం

రిలే దీక్షలో వెటర్నరీ విద్యార్థులు



దీక్ష చేస్తున్న వెటర్నరీ విద్యార్థులు

గన్నవరం: ప్రభుత్వం స్పందించే వరకు పోరాడతామని వెటర్నరీ విద్యార్థులు చెప్పారు. స్థానిక ఎన్టీఆర్ పశువైద్య కళాశాల విద్యార్థులు చేపట్టిన రిలే దీక్షలు మంగళవారం 16వ రోజుకు చేరాయి. దీక్షలో దీపిక, మేఘన, అనూప్‌కుమార్, సాయితేజ బైటాయించగా, మిగిలిన విద్యార్థులు వీరికి సంఘీభావం తెలిపారు. విద్యార్థి నేతలు మాట్లాడుతూ.. ఉపకార వేతనాల పెంపు కోరుతూ విజ్ఞప్తి చేస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదన్నారు.

ప్రభుత్వం ఇస్తున్న రూ. 7 వేలు చాలీచాలని ఉపకార వేతనంతో చదువులు కొనసాగించాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వం స్పందించి మెడికల్, డెంటల్, ఆయుష్ విద్యార్థులతో సమానంగా వెటర్నరీ విద్యార్థులకు కూడా రూ. 23 నుంచి రూ. 26 వేలు స్టైఫండ్ చెల్లించాలని కోరారు.

పాతపాడులో నీటి కష్టాలు

- కృష్ణా జలాల సరఫరా నిలిపివేసిన ప్రభుత్వం
- ఎండా కాలంలో అవస్థలే

విజయవాడరూరల్: విజయవాడకు కూతవేటు దూరంలో ఉన్న పాతపాడు గ్రామస్తులకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. కూటమి అధికారం చేపట్టిన తర్వాత పాతపాడు గ్రామానికి విజయవాడ నగర పాలక సంస్థ సరఫరా చేసే కృష్ణా తాగునీటిని నిలిపివేసింది. బోర్, ఆర్వో ప్లాంట్ నీటిని తాగడానికి గ్రామస్తులు అవస్థ పడుతున్నారు. పాతపాడుతో పాటు శివారు గ్రామలైన మంగళాపురం, అప్పారావుపేట గ్రామాల్లోని ప్రజలకు బోర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తోంది. ఆ బోరు నీటిని తాగడానికి కాకుండా వారి అవసరాలకు మాత్రమే ఉపయోగించుకుంటున్నామని ప్రజలు అంటున్నారు.



వీఎంసీ వాటర్ ట్యాంక్



పాతపాడులో బావి నీటిని తోడుకుంటున్న గ్రామస్తులు

బోరు నీరు వద్దంటూ..

జలజీవన్ మిషన్ ద్వారా ఏడు నెలల క్రితం ఇంటింటికీ తాగునీటి కుళాయి కనెక్షన్ అంటూ రూ.13 లక్షలతో సీతారామపురం, మంగళాపురం, అప్పారావుపేట గ్రామాలకు పైపులైను ఏర్పాటుచేశారు. వాటిలో వచ్చేది బోరు నీరు కావడంతో మాకొద్దని గ్రామస్తులు అంటున్నారు. జలజీవన్ మిషన్‌లో ఏర్పాటుచేసిన పైపులైన్‌తో ఇబ్బంది పడుతున్నామంటున్నారు. ఆర్వో ప్లాంట్ నుంచి 20 లీటర్ల తాగునీటిని రూ.12కు కొనుగోలు చేస్తున్నారు.

మళ్లీ చెరువు నీరే..

ఈ నీటిని తాగడంతో మోకాళ్ల నొప్పులు వస్తున్నాయని, ఎన్నడూలేని విధంగా కాళ్ల దొడ్డుకాళ్లుగా వంకర్లు తిరిగి మనుషుల నడవడానికి ఇబ్బంది పడుతున్నామని చెబుతున్నారు. రోగాలబారిన పడటం కంటే పూర్వ కాలం నుంచి ఎర్ర చెరువు మూలన ఉన్న బావి నుంచి గ్రామస్తులు నీటిని తెచ్చుకొని ఉపయోగించుకుంటున్నారు. గ్రామంలోని కొన్ని కుటుంబాల వారు బావి నీరు తాగుతున్నారు.

పంచాయతీకి సమాచారం లేకుండా సరఫరా నిలిపివేత

విజయవాడ నగరపాలక సంస్థ నగరంలోని చెత్తను పాతపాడు గ్రామంలోని క్వారీ గోతులకు తరలించినంత కాలం ప్రతి రోజూ విలేజి కంక్రికలో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంక్ నుంచి పాతపాడు గ్రామానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పైపులైను ద్వారా కృష్ణానది నీటిని సరఫరా చేస్తుండేది. ప్రస్తుతం నగరంలోని చెత్తను పాతపాడు గ్రామానికి చెత్త తరలించడం ఆపివేసింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తర్వాత గ్రామ పంచాయతికి ఎలాంటి సమాచారం లేకుండా తాగునీటి సరఫరా నిలిపి వేయడం అర్థం కావడంలేదని పంచాయతీ పాలకవర్గం అంటోంది. కొన్నేళ్లుగా వీఎంసీ డంప్ చేసిన వ్యర్థాల కారణంగా భూగర్భ జలాలు కలుషితమైనట్లు గ్రామస్తులు అంటున్నారు. దీంతో బోర్ల నుంచి వచ్చే నీరు తాగలేక పోతున్నామని, తప్పనిసరి పరిస్థితిలో వాడుకుంటున్నామని చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం వీఎంసీ నీటిని తాగునీరుగా సరఫరా చేయాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.



నిలిపేశారు

విజయవాడ నగరపాలక సంస్థ తాగునీటి సరఫరా నిలిపివేసింది. దీనికి సంబంధించిన సమాచారం లేదు. తాను కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టే నాటికి వీఎంసి వాటర్ రావడంలేదు. పంచాయతీ నుంచి బోర్లు ద్వారా నీటిని సరఫరా చేస్తున్నాం.

–పి.కోటిలింగమ్మ, పంచాయతీ కార్యదర్శి



నీటిని తాగలేక పోతున్నాం

బోర్లు ద్వారా వచ్చే నీటిని తాగలేక పోతున్నాం. తప్పనిసరి పరిస్థితుల్లో ఆర్వోప్లాంటు నుంచి కొనుగోలు చేసి నీటిని తాగుతున్నాం. వీఎంసీ నీటి సరఫరా చేయాలి.

–ఆదినారాయణ, పాతపాడు

వేలేరులో రైల్వే అండర్ పాస్ నిర్మాణానికి పరిశీలన

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వేలేరులోని రైల్వే క్రాసింగ్ నెం.334 వద్ద అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించాలని జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మకు గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. గ్రామం మధ్యలో నుంచి వెళ్లుతున్న రైల్వే లైన్‌కు గేటును మూసివేశారని, దీంతో గ్రామస్తులకు ఇబ్బందులు కలుగుతున్నాయని జేసీ వద్ద వాపోయారు. వేలేరులోని ఎస్‌సీ నంబర్.334 వద్ద అండర్ పాస్ బ్రిడ్జి ప్రాతిపాదన పరిశీలించేందుకు జేసీ గీతాంజలి శర్మతో పాటుగా రైల్వే, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ అధికారులు మంగళవారం పర్యటించారు. గ్రామం మధ్య నుంచి వెళ్లుతున్న రైల్వే లైనుపై ఉన్న గేటును 9 ఏళ్ల క్రితం మూసివేయటంతో గ్రామస్తుల రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నాయని చెప్పారు. అంతే కాకుండా గ్రామంలో కోతుల బెడద అధికంగా ఉందని, పంటలకు తీవ్ర నష్టం కలుగజేస్తున్నాయని రైతులు ఆమెకు మరో వినతిపత్రం అందించారు. గుడివాడ ఆర్డీవో బాల సుబ్రహ్మణ్యం, బాపులపాడు తహసీల్దార్ బి.మురళీకృష్ణ, మాజీ సర్పంచ్ వేములపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డాబా ఎక్కిన రొయ్య

భలే.. భలే.. ఈ రొయ్య ఏంటీ డాబా ఎక్కింది? అని అనుకుంటున్నారా. అయితే అది రొయ్య కాదు. అచ్చం రొయ్యను తలపిస్తున్న బొమ్మ. కృష్ణా జిల్లా పెనమలూరు మండల పరిధిలోని గంగూరు చేపల కుండీల వద్ద దర్శనమిస్తున్న ఈ రొయ్య విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిపై రాకపోకలు సాగించేవారిని ఆకట్టుకుంటోంది. రాష్ట్ర ఫిషరీస్ కమిషనరేట్ కార్యాలయం ఆవరణలో ఉన్న భవనంపై పది అడుగుల పొడవున టైగర్ రొయ్య బొమ్మను ఏర్పాటు చేశారు. – పెనమలూరు



పోరంకి ఫిషరీస్ కమిషనర్ కార్యాలయం పైన టైగర్ రొయ్య బొమ్మ

భక్తాంజనేయ దేవస్థానానికి విరాళం

గన్నవరం: స్థానిక బస్టాండ్ సమీపంలోని శ్రీభక్తాంజనేయస్వామి దేవస్థానానికి ఉంగుటూరు మండలం పొణుకుమాడు గ్రామానికి చెందిన వీరమాచినేని వెంకటేశ్వరబాబు రూ. 72 వేలు విరాళం ఇచ్చారు. మంగళవారం ఆలయ అర్చకులు రాధాకృష్ణమూర్తికి విరాళం నగదును అందజేసి, దేవస్థానం పేరుతో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి దానిపై వచ్చే వడ్డీతో ఏటా హనుమజ్జయంతి రోజున జరిగే అన్నసమారాధన కార్యక్రమానికి వినియోగించాలని వీరమాచినేని తెలిపారు. అనంతరం ఆయనను ఆలయ అర్చకులు సత్కరించారు. స్థానికుడు నెక్కలపూడి ఈశ్వరరావు, ఆలయ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



అర్చకుడికి విరాళం నగదు అందజేస్తున్న వీరమాచినేని వెంకటేశ్వరబాబు

21న విద్యుత్ అదాలత్

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): విద్యుత్ శాఖకు సంబంధించి దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడానికి ఈ నెల 21వ తేదీన విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ గుణదల డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.హరిబాబు ఓ ప్రకటనలో తెలిపారు. కంకిపాడు బ్యాంక్ కాలనీలోని ఆంజనేయ స్వామి గుడి దగ్గర ఉన్న రాయల్ ఫంక్షన్ హాలులో శుక్రవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు అదాలత్ జరుగుతుందన్నారు. గుణదల విద్యుత్ డివిజన్ పరిధిలోని గుణదల, పటమట, ఆటోనగర్, రామవరప్పాడు, ఎనికేపాడు, నున్న, గన్నవరం, కంకిపాడు, పెనమలూరు ప్రాంతాల్లోని వినియోగదారులు రావచ్చని పేర్కొన్నారు.

నేడు యనమలకుదురు, కానూరులో విద్యుత్ ఉండని ప్రాంతాలివే

పెనమలూరు: యనమలకుదురు, కానూరు గ్రామాల్లో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. యనమలకుదురులో మహాశివ రాత్రి సందర్భంగా సాయినగర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా గ్రామంలో బుధవారం ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. సాయినగర్, పుట్టరోడ్డు, మాదుతిరుపతిరావు నగర్, టవర్ రోడ్డు, శివపార్వతీనగర్, డొంకరోడ్డు, వినాయక్‌నగర్, జన్మభూమి వంతెన ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని వివరించారు.

కానూరులో..

కానూరులో మహదేవపురంకాలనీ సనత్‌నగర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరా ఉండదు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు సనత్‌నగర్, మహదేవపురంకాలనీలో పూర్తిగా విద్యుత్ ఉండదని అధికారులు తెలిపారు.

ఉయ్యూరు: పామర్రు సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరా నిలుపు చేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఈఈ డి.కృష్ణనాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాంకేతిక మరమ్మతుల కారణంగా ఉదయం 6 నుంచి 10 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

దాడి కేసు నమోదు

ఉంగుటూరు: ఓ వ్యక్తిపై దాడికి పాల్పడిన వారిపై ఉంగుటూరు పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మధిరపాడుకు చెందిన కొడాలి జాన్‌సుందర్‌రావు సోమవారం మధ్యాహ్నం ఇందుపల్లి సెంటర్‌లో టీ తాగుతున్నాడు. ఆ సమయంలో గ్రామస్తుడు మసిముక్కు ఏసుబాబు మద్యం సేవించి అకారణంగా జాన్ సుందరంపై దాడికి పాల్పడ్డాడు. అక్కడే ఉన్న జాన్ సుందరం అన్నయ్య ఇస్మాయిల్ వారిని ఆపే ప్రయత్నం చేయగా అతనిని కూడా ఏసుబాబుతో పాటు చంటి, బాలు దాడి చేశారు. దీంతో జాన్ సందరరావు ఉంగుటూరు పోలీసులను ఆశ్రయించాడు. ఘటనపై ఎస్ఐ గోవిందు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'శిడిబండి' సందడి

ఉయ్యూరులో శిడిబండి ఉత్సవం మంగళవారం సందడిగా జరిగింది. వీరమ్మతల్లి తిరునాళ్లలో భాగంగా భక్తజన కోలాహలం మధ్య ఉత్సవం చేశారు.పెండ్లి కుమారుడు శిడిబుట్టలో కూర్చోవడాన్ని భక్తులు వీక్షించి తరించారు. ఊరేగింపుగా సాగిన శిడిబండికి భక్తులు హారతులు పట్టారు. శిడి ఆడే సమయంలో భక్తులు అరటికాయలు విసురుతూ సందడి చేశారు. –ఉయ్యూరు







